క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహ ఫ్లెడ్జ్ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, స్థానికులు

పాకాల : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.కృష్ణవేణి తెలిపారు. గురువారం మండలంలోని వరదప్పనాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహ ముక్త్ ప్లెడ్జ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అమ్మాయికి వివాహం చేయడానికి సుమారు 21 ఏళ్లు నిండి ఉండాలని సూచించారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల అనేక రకాల సమస్యలు ఎదురవుతాయని వివరించారు. తల్లిదండ్రులు ఆడపిల్లల వివాహ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సత్య, ఆశావర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల్లో మనోధైర్యం నింపాలి



భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతుల సంబరాలు

చంద్రగిరి: ప్రత్యేక ప్రతిభావంతుల్లో జాలి, దయతో వారిని ఆదరించడంతో పాటు వారిలో మనోధైర్యాన్ని నింపాలని విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు వెంకటరమణ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని భవితా కేంద్రలో సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను, పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ్ కుమార్, భవిత కేంద్రం రీసోర్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

చంద్రగిరి: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. గురువారం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీజేపీ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి లో సాధారణ సభ్యత్వం కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. గ్రామ కమిటీలు, పోలింగ్ బూత్ కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్క రూ ముందుకు సాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం యాదవ్, గాలిపుష్పలత, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల: తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయాన్ని చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ప్రారంభించారు. ఇటీవలే చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చిన్నపాటి మరమ్మతులు చేయడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులకు పండితులు వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శాంతారామ్, డిప్యూటీ ఈఓలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్, వీజీఓ రామ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి మునుబోలు వేణుగోపాల్‌నాయుడుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ వి.దివాకర్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఎస్ ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ అర్డర్ అండ్ కార్న్ బేస్డ్ రెనీఫోర్స్‌డ్ కాంపోసైట్స్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ రెవెన్యూ సమస్యలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ప్రధానంగా ఇటీవల కాలంలో అత్యంత అభివృద్ధి చెందుతున్న తిరుపతి నగరం జిల్లా కేంద్రం కావడంతో భూముల ధరలు రోజుకు ఓ రేటు పెరిగిపోతున్నాయి. కూటమి సర్కారు రాగానే నేతలు పోటీ పడి ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ వస్తున్నారు. మరి రెవెన్యూ శాఖ అధికారులు నేటి నుంచి నిర్వహించే ఈ సదస్సుల్లో అక్రమాలకు చెక్ పెడతారా..! ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలకు పరిష్కారం చూపుతారా..? లేదంటే యథావిధిలాగే అర్జీలు తీసుకుని కట్ట కట్టి కార్యాలయాల్లో మూలన పడేస్తారా అనేది ప్రజల మనుసులను తొలుస్తున్న అనుమానాలు.

- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- ఏళ్ల తరబడి వెంటాడుతున్న భూముల సమస్యలెన్నో..!
- కూటమి సర్కారు వచ్చాక తిరుపతిలో ఇష్టారీతిన భూఆక్రమణలు
- కూటమి నేతల అక్రమాలకు అధికారులు చెక్ పెడతారా ?
- గ్రీవెన్స్‌లో వస్తున్న అర్జీల్లో 55 శాతం రెవెన్యూ సమస్యలపైనే ..



తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

తిరుపతి అర్బన్: తిరుపతి మహానగరంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజల సమస్యలకు అధికారులు ఈ రెవెన్యూ సదస్సుల్లో అయినా పరిష్కారం చూపుతారా అని జనం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రతి రోజు రెవెన్యూ సమస్యలపై తిరుపతి తహసీల్దార్ కార్యాలయంలోనే కాకుండా ఆర్డీఓ కార్యాలయం, చివరిగా కలెక్టరేట్ కార్యాలయం వేదికగా అర్జీలను అందిస్తున్నారు. సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో మొత్తం వచ్చిన అర్జీల్లో చూస్తే 55 శాతం అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉంటున్నాయి. ఈ క్రమంలోనే భూసమస్యల పరిష్కారానికి కూటమి సర్కారు నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అధికారులేమో..'మీ సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యే దిశగా చర్యలు చేపడుతాం' అని గట్టిగానే చెబుతున్నారు. దీంతో తిరుపతి వాసులు కోటి ఆశలతో రెవెన్యూ సదస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు హాజరు కావాల్సి ఉంది.

సమస్యలెన్నో.. పరిష్కారాలేవీ..!

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలే కాకుండా విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు.. తప్పుల సవరణలకు సంబంధించి అర్జీలు ఇవ్వడానికి అవకాశం ఉంది. అంతేకాకుండా రేషన్‌కార్డులో తప్పులు ఉన్నా.. కొత్త రేషన్‌కార్డుల కోసం కూడా అర్జీలు ఇవ్వొచ్చు. మరోవైపు ఆధార్‌కార్డులో తప్పుల సవరణకు, స్థానికంగా పారిశుద్ధ్యం, విద్యుత్, దారి సమస్యలు ఇలా ప్రతి సమస్యకు అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయవచ్చు.

అందరూ వస్తారా..?

రెవెన్యూ సదస్సులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అయితే అధికారులు ఆ సమయపాలన పాటిస్తారా ? లేదా నామమాత్రంగా అలా వచ్చి ఇలా వెళ్లిపోతారా ? అనే అనుమానాలు అందరిలో ఉన్నాయి. అంతేకాదు పలు విభాగాలకు చెందిన అధికారులు రెవెన్యూ సదస్సుకు హాజరుకావాలని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. అంతా వస్తారా..? అనే సందేహాలు కలుగుతున్నాయి ?

సదస్సులు ఎక్కడెక్కడంటే..?

ఈ నెల 6వ తేదీన తుడా కార్యాలయ సమీపంలోని కచ్చపి స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు జరుగుతుంది. ఈ నెల 11న అక్కారంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో, 17న కొంకచెన్నైయ్యగుంట ఆటోనగర్ గంగమ్మ గుడి వద్ద, 23న తిమ్మినాయుడుపాళెం పరిధిలోని తిరుమలరెడ్డినగర్‌లో సచివాలయం 01, 02 వద్ద రెవెన్యూ సదస్సులు చేపట్టనున్నారు. అలాగే ఈ నెల 26న మంగళం పరిధిలోని ధర్మరాజులగుడి వద్ద, 28న చెన్నయ్యగుంట పరిధిలోని శ్రీరాములవారి ఆలయం, 30న శెట్టిపల్లి సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోండి..



సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సులు జరుగుతాయి. ఈ సందర్భంగా మీ సమస్యలను స్పష్టంగా తెలియజేయండి. మీ ప్రాంతంలో సదస్సు జరిగేటప్పుడు అర్జీలతోపాటు మీ వద్ద ఉన్న భూహక్కు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. సదస్సులకు విధులు కేటాయించిన అధికారులు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. ఏదో సాకులు చెబితే కుదరదు. ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకు అధికారులు ఉంటారు.

\- కేపీ భాగ్యలక్ష్మి, తహసీల్దార్, తిరుపతి అర్బన్

పుష్పయాగం రేపు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం సాయంత్రం పుష్పయాగం జరగనుంది. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు అమ్మవారికి పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాల్లో తెలిసీ తెలియక జరిగిన తప్పులకు ఏర్పడిన దోష నివారణకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9గంటలకు యాగశాలలో ప్రత్యేక పూజలు, 10.30 గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటల నుంచి 8 వరకు భక్తులు, దాతలు సమకూర్చిన పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహిస్తారు.

టీ కొట్టు నిర్వాహకుడిపై దాడి



తిరుపతి క్రైమ్: నగరంలోని చెన్నారెడ్డి కాలనీలో టీ షాపులో సిగరెట్ లేదు అన్నందుకు షాప్ యాజమానిని చితక్కొట్టిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నారెడ్డి కాలనీలో అనిల్ అనే వ్యక్తి టీ షాప్ నిర్వహిస్తున్నారు. కొందరు యువకులు వచ్చి సిగరెట్ కావాలని అడగ్గా.. సిగరెట్లు అయిపోయాయని అనిల్ సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ యువకులు దుర్భాషలాడుతూ.. షాప్లోని వస్తువులను బయటపడేసి అనిల్‌ను రక్తం వచ్చేలా కొట్టారు. గాయాలతో అనిల్ ఆస్పత్రిలో చేరాడు. దీనిపై విచారణ చేపట్టామని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయం



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: కడప జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఆజాద్ అహ్మద్ విధుల్లో ఉండగా విద్యార్థులు అమానుషంగా దాడి చేసి చంపడం హేయనీయమైన చర్య అని ఎస్ఎల్‌టీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర్ అన్నారు. గురువారం కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుడి మృతికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆకృత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలుగురు లేరు..ఎందుకు ఓవరాక్షన్ !

- జనసేన నాయకులపై టీడీపీ నేతల మాటల తూటాలు
- కూటమిలో మొదలైన కుంపటి
- తగ్గుతున్నామని ఎక్కువ చేయకండి అంటూ జనసైనికుల కౌంటర్

తిరుపతి తుడా: కూటమి నేతల్లో కుంపట్లు మొదలయ్యాయి. నువ్వెంతంటే నువ్వెంతని మాటల యుద్ధానికి దిగారు. 'నలుగురు నాయకులు లేరు మీరు మీ ఓవర్ యాక్షన్ ఏంది' అంటూ జనసేన నేతలను ఉద్దేశించి టీడీపీ నాయకులు అవహేళనగా మాట్లాడగా.. 'తిరుపతికి మా పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఉండగా మీ పెత్తనమేంటి' అని జనసేన నేతలు టీడీపీ నాయకులపై మండిపడ్డారు. స్థానిక భవానీనగర్లో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. నగర మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు. ఈ కార్యక్రమం కాస్త జనసేన వర్సెస్ టీడీపీగా మారింది. అధికారం చేపట్టి పట్టుమని ఆరు నెలలు గడవకముందే కూటమి నేతలు భగ్గుమంటున్నారు. నువ్వెంతంటే నువ్వెంత అని ఒకరిపై మరొకరు తీవ్ర వాగ్వాదానికి దిగారు. రోడ్డుకు భూమి పూజ లో కార్యక్రమంలో హారతి ఇచ్చే క్రమంలో నాయకులంతా హారతి తట్ట పట్టుకునేందుకు పోటీపడ్డారు. జనసేనకు చెందిన సుభాషిణి టీడీపీ నేతలు నరసింహాయాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణకు అడ్డుగా వచ్చారు. పక్కకు జరగాలని ఆర్సీ మునికృష్ణ ఆమెకు ఎంతచెప్పినా వినలేదు. దీంతో ఆమెను పక్కకు నెట్టడంతో ఆ మహిళా నాయకురాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నన్నే పక్కకు నెడతారా' అంటూ టీడీపీ నాయకులపై మండి పడ్డారు. తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. దీంతో స్థానిక టీడీపీ నేతలు ఆమెపై కయ్‌మన్నారు. 'మీకు నలుగురు నాయకులు లేరు.. ఎక్కడచూసినా అడ్డుగా వస్తారా.. మా నేతలను తిడతారా' అంటూ మూకుమ్మడిగా జనసేన నేతలపై దూసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే గాని, టీడీపీ సీనియర్ నేతలు గాని సర్ది చెప్పకపోవడంతో సుమారు అర్ధగంట పాటు ఒకరినొకరు తిట్టుకున్నారు.

నేలను కాపాడుకుందాం



భూసార పరీక్షల ఫలితాల పత్రాలను చూపుతున్న రైతులు

రామచంద్రాపురం: నేలను కాపాడి భావితరాలకు అందిద్దామని వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు. గురువారం రాయలచెరువు గ్రామంలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడడం వల్ల నేలలోని పోషక విలువలు తగ్గుతున్నాయని, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ క్రమంలోనే రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను అందించారు. అనంతరం నేలను కాపాడుతామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూ సమస్యలపై 624 అర్జీలు

- చివరిరోజు 26 అర్జీలు
- 86 సర్వే నంబర్లకు 624 భూహక్కు పత్రాల సమర్పణ

తిరుపతి అర్బన్: తిరుపతిలోని శెట్టిపల్లి భూసమస్యలపై ఆర్డీఓ కార్యాలయంలో గురువారం 4వ రోజు 26 అర్జీలకు చెందిన భూహక్కుపత్రాలను రెవెన్యూ అధికారులకు బాధితులు అందించారు. వారం రోజుల కిందట క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి శెట్టిపల్లి భూ సమస్యలను పరిష్కరిస్తామని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ ఓ ప్రకటన ద్వారా తెలిపిన విషయం విదితమే. ఆ మేరకు శెట్టిపల్లి భూ సమస్యలపై మొదటిరోజు 428 నుంచి 474 వరకు ఉన్న సర్వేనంబర్లకు సంబంధించి 52 అర్జీలు, రెండో రోజు 387 నుంచి 408 సర్వే నంబర్ల వరకు 261 అర్జీలు, మూడో రోజు 409 నుంచి 427 సర్వేనంబర్లతో పాటు 475 సర్వే నంబర్‌కు సంబంధించి 285, 4వ రోజు 26 అర్జీలు అందాయి. మొత్తం 86 సర్వే నంబర్లకు సంబంధించి 624 అర్జీలతోపాటు భూహక్కుపత్రాలను సమర్పించారు. ఇక అధికారులు వాటికి పరిష్కారం చూపాల్సి ఉంది. శుక్రవారం నుంచి పది రోజుల పాటు 624 అర్జీలను ఒక్కొక్కటిగా పరిశీలన చేస్తామని ఆర్డీఓ రామ్మోహన్ వెల్లడించారు.

వర్సిటీలో అన్యమత ప్రచారాలకు చోటివ్వద్దు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన బాధాకరమని, వర్సిటీలో అన్యమత ప్రచారాలకు చోటు ఉండకూడదని టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలసి ఆయన అన్యమత ప్రచార ఘటనపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యమత ప్రచారం జరిగిందన్న విషయంపై స్పష్టమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చించామన్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఇప్పటికే నలుగురు సభ్యులతో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశామని, విచారణ శరవేగంగా జరుగుతోందన్నారు. కమిటీ నివేదికను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సుబ్బారెడ్డికి ఘన నివాళి



గాదె సుబ్బారెడ్డికి నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్య మండలి, తిరుపతి బాలోత్సవం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రజా కళా సాంస్కృతిక రంగాల నిర్మాత, తిరుపతి బాలోత్సవం మార్గదర్శి గాదె సుబ్బారెడ్డి మృతికి ప్రజానాట్య మండలి, తిరుపతి బాలోత్సవం ప్రతినిధులు గురువారం ఘన నివాళులు అర్పించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో సుబ్బారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి నాగార్జున మాట్లాడుతూ సుబ్బారెడ్డి తన జీవితం అంతా ప్రజా సాంస్కృతిక చైతన్య పెంపునకు కృషి చేశారని, తిరుపతి బాలోత్సవం ఆయన మార్గదర్శకత్వంతో ఏర్పాటుతో నిర్విఘ్నంగా సాగుతోందన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ ఓ.వెంకటరమణ మాట్లాడుతూ అక్షర కళాజాత, శ్రీశ్రీ శతజయంతి, సుందరయ్య కళాజాత, వేమన విజ్ఞాన జాతా వంటి అనేక కళారూపాలను రాష్ట్రమంతా సమన్వయంతో నడిపించిన కార్యశీలి అని కొనియాడారు. నాటక రచయిత, నటుడు, దర్శకుడు ప్రజా నాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడి మరణం కళారంగానికి తీరని లోటన్నారు. ఆకాశవాణి మాజీ సంచాలకుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంస్కృతిని, ప్రజా కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యవంతం కలిగించడమే వారికి నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో వేమన విజ్ఞానకేంద్రం, తిరుపతి బాలోత్సవం ప్రతినిధులు టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, రాజు, మునిలక్ష్మి, శెల్వరాజు పాల్గొన్నారు.

జీతాలు జమ కాకపోతే విధులు బహిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తున్న శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులకు సోమవారంలోపు రెండు నెలల జీతాలు ఖాతాల్లో జమ చేయకపోతే విధులు బహిష్కరిస్తామని వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు గురువారం అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, సెక్రటరీ సుబ్రమణ్యం వర్సిటీ అధికారులకు తేల్చిచెప్పారు. గత రెండు నెలలుగా శాశ్వత, తాత్కాలిక, పెన్షనర్లకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులు కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారు టైంస్కేల్, ఎన్ఎంఆర్, పెన్షనర్ల అసోసియేషన్ల సభ్యులతో సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. సోమవారం వరకు వేచి చూసి మంగళవారం నుంచి విధులను బహిష్కరించాలని వర్సిటీలోని అన్ని ఉద్యోగ సంఘాలు నిర్ణయం తీసుకున్నాయి.

ఆకస్మికంగా వృద్ధుడి మృతి



మృతి చెందిన కె.చిన్నస్వామి మందడి

పాకాల : కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ఆకస్మికంగా వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గురువారం మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా, పి.కొత్తకోట పంచాయతీ పాతమోటకంపల్లికి చెందిన కె.చిన్నస్వామి మందడి(72) ఇంటి నుంచి సుమారు 11 గంటల ప్రాంతంలో పాకాలకు వెళ్లాడు. కూరగాయలు తీసుకుని ఇంటికి రావడానికి బస్సు కోసం వేచి ఉండగా హఠాత్తుగా మృతి చెందినట్లు పోలీసుల నుంచి సమాచారం రావడంతో హుటాహుటిన పాకాలకు వెళ్లి మృతదేహాన్ని తీసుకుకొచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సిరుల తల్లికి కళా నీరాజనం







శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వివిధ కళా వేదికలపై కళాకారులు ఆధ్యాత్మిక భక్తి సంగీత, నృత్యాలతో సిరులతల్లి శ్రీపద్మావతి అమ్మవారికి కళా నీరాజనాలు పలికారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి, శిల్పారామంతో పాటు తిరుచానూరులోని ఆస్థాన మండపం కళా వేదికలపై ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహతి కళాక్షేత్రంలో శ్రీహరి మహాలింగేశ్వర నృత్య నాటకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

\- తిరుపతి కల్చరల్

మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ ఆడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజల సౌకర్యార్థం మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక ఇందిరా మైదానంలో ఇండోర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వారు శ్యాప్ చైర్మన్ రవినాయుడు, కమిషనర్ మౌర్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.8.80 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మించామని, ప్రజలకు, క్రీడాకారులకు పలు రకాల క్రీడలను అందుబాటులోకి తీసుకు రానున్నట్లు చెప్పారు. ఇండోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్, వాలీబాల్, షటిల్ వంటి క్రీడలతో పాటు ఇండోర్ క్రీడలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఉంటాయన్నారు. మొదటి అంతస్తులో రెండు టేబుల్ టెన్నిస్, రెండు క్యారమ్ బోర్డులు, ఎయిర్ హాకీ, పూల్ టేబుల్ కోర్టులు, రెండవ అంతస్తులో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేయర్ శిరీష్, స్మార్ట్ సిటీ మేనేజర్ చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ , డిప్యూటీ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొన్నారు.